ప్రజాశక్తి
శుక్రవారం 9 మే 2025
5
విజయనగరం



12న గజపతినగరంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-గజపతినగరం

ఈనెల 12న గజపతినగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఆవరణలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ , డిగ్రీ, బి టెక్, ఏదయినా పిజిలో ఉత్తీర్ణత సాధించి వయస్సు 18 నుండి 35ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తారని తెలిపారు. జాబ్ మేళా కు 35 బహుళ జాతి కంపెనీలు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగ పర్చుకోవాలని కోరారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతియువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డు తో పాటుగా బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరములకు నెంబర్ 7989826953 లేదా టోల్ ఫ్రీ 9988853335 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

- మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలుగా కవులవాడ భూముల రిజిస్ట్రేషన్
- గగ్గోలు పెడుతున్న రైతులు
- విచారణకు ఆదేశించిన ఎమ్మెల్యే లోకం మాధవి
- మధురవాడ సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

వన్‌బి ఒకరిది.. రిజిస్ట్రేషన్ మరొకరిది



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని కవులవాడ రెవెన్యూ పరిధిలోని భూములు విశాఖ జిల్లా మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు జరగడంతో బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఒకరి పేరుమీద ఉన్న వన్-బిని పెట్టి మరొకరి భూమిని రిజిస్ట్రేషన్ చేయడం విశేషం. ఈ విషయం బాధితులకు తెలియడంతో ప్రస్తుతం ఉన్న మధురవాడ సబ్‌రిజిస్ట్రార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అంతేకాక ఈ విషయం ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి బాధితులు తీసుకువెళ్ళడంతో ఆమె కూడా స్పందించి విచారణకు ఆదేశించారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం..

తూడెం గ్రామానికి చెందిన పైల రామలక్ష్మి భర్త పైల రమణ పేరు మీద సుమారు 1.26సెంట్లు భూమి ఉంది. దీనికి సంబంధించిన పాస్‌బుక్ కూడా రమణ పేరు మీద ఉంది. భర్త పైల రమణ మృతి చెందడంతో భార్య తన పేరు మీద ఆన్‌లైన్ చేసేందుకు మ్యుటేషన్ పెట్టారు. ఇందులోని 43సెంట్లు రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఇసిలో వచ్చింది. తాము ఏనాడూ అమ్మకుండా ఎలా అమ్మకం జరిగిందని నకలు డాక్యుమెంటు తీయగా వేరొకరు పేరు మీద మరొకరు రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. ఈ భూమి రిజిస్ట్రేషన్ కోసం దువ్వ ఎల్లయ్య పేరు మీద ఉన్న వన్ బిని పెట్టి దువ్వ రాంబాబు అనే వ్యక్తి పేరు మీద పైలరమణకు చెందిన 43సెంట్లు భూమిని ఈ ఏడాది మార్చి 24న రిజిస్ట్రేషన్ చేసేశారు. అలాగే దువ్వ రాము పేరు మీద ఉన్న భూమికి దువ్వ ఎల్లయ్యకు చెందిన వన్‌బిని పెట్టి దువ్వ రాము అనే వ్యక్తి తన సొంత తండ్రి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఎల్లయ్య కుమారుడు దువ్వ రాములు ఆరోపించాడు. అలాగే తమ భూమిని కూడా తప్పుడు వన్‌బితో సోదరుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని దువ్వ రాములప్పుడు కూడా ఆరోపించాడు.

ఆ సబ్ రిజిస్ట్రార్ నిర్వాకమే

భోగాపురంలో రిజిస్ట్రేషన్లు చేస్తే తెలిసిపోతుందనే ఉద్దేశంతో ఏకంగా మధురవాడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన రోషన్ కుమార్ మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఇక్కడ ఉన్న పరిచయాలతో కొంత మంది వ్యక్తులు ఆయనను ఆశ్రయించడంతో ఆయన హయాంలోనే మధురవాడలో ఈ రిజిస్ట్రేషన్లు జరిగాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్ళడంతో ఆమె వెంటనే స్పందించారు. దీనిపై విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులు గురువారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఆయన బాధితులకు తెలిపారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

మత్స్యకారులతో మాట్లాడుతున్న పోలీసులు

యుద్ధ వాతావరణంతో

పోలీసులు అప్రమత్తం

- తీరప్రాంతంలో భద్రత కట్టుదిట్టం
- డ్రోన్లు, బాంబు, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి-పూసపాటిరేగ, భోగాపురం

భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు జిల్లాలో ముఖ్యమైన ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. డ్రోన్స్, బాంబ్, డాగ్ స్క్వాడ్తో తనిఖీలు ముమ్మరం చేశారు. ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అప్రమత్తమైనట్లుగా ఎస్‌పి వకుల్ జిందల్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లాలోని కోరుకొండ సైనిక్ స్కూలు, చింతపల్లి లైట్‌హౌస్, తీర ప్రాంతంలోని గ్రామాల్లోను మెరైన్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా గురువారం తనిఖీలు చేపట్టి, తీరప్రాంత గ్రామస్థులను అప్రమత్తం చేసామన్నారు. అంతేకాకుండా, కోరుకొండ సైనిక్ స్కూలు, అధికార భవనాలు, చింతపల్లి లైట్ హౌస్ తోపాటు, ఇతర తీరప్రాంత గ్రామాలైన తిప్పలవలస, ముక్కాం, నీలగెడ్డపేట, పాద్దూరు, చేపల కంచేరులో డ్రోన్స్, డాగ్స్, బాంబు స్క్వాడ్స్ తనిఖీలు చేపట్టారు. సముద్రంలో చేపల వేటపై నిషేదం ఉన్నందున మత్స్యకారులను వేటకు వెళ్ళవద్దని, తీర ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే షిప్పులు, అనుమానస్పద వ్యక్తులు ఎదురుపడితే సమాచారాన్ని మెరైన్ లేదా స్థానిక పోలీసులకు అందించాలని సూచించారు.

యుద్ధ ప్రభావం తీర ప్రాంతాలపై ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమై, మెరైన్ పోలీసుల సహకారంతో పటిష్టమైన భద్రత చర్యలుచేపట్టడంతోపాటు, తీరప్రాంతంలో నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో భోగాపురం సిఐ కె.దుర్గా ప్రసాద్, మెరైన్ సిఐ బి.వి.జె.రాజు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, పలువురు ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, మెరైన్ పోలీసులు, డాగ్, బాంబ్ స్క్వాడ్స్, డ్రోన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కోట వద్ద నిరసన తెలుపుతున్న డిఎస్‌సి అభ్యర్థులు

డిఎస్‌సికి గడువు పెంచాలి

- వయోపరిమితి 47ఏళ్లకు పెంచాలి
- కోట జంక్షన్ వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి పరీక్ష గడువు పెంచాలని, అభ్యర్థుల వయో పరిమితిని 47ఏళ్లకు పెంచాలని, జిల్లాకు ఒకే పేపరు విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కోట జంక్షన్ వద్ద అభ్యర్థులు డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులు ఏళ్లతరబడి చేసిన పోరాట ఫలితంగా డిఎస్‌సి నోటిఫికేషన్ సాధించుకున్నామని తెలిపారు. ఏడేళ్ల తర్వాత వెలుడిన నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు సన్నద్ధం కావడానికి పరీక్షకు కనీసం 90రోజులను సమయం లేకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. వయోపరిమితి 44 సంవత్సరాలుగా పేర్కొనడంతో చాలా మందికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం 47సంవత్సరాలకు ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవడానికి వయోపరిమితి పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా 47ఏళ్ల వరకు అవకాశం కల్పించాలని కోరారు. నార్మలైజేషన్ రద్దుచేసి జిల్లాకు ఒకే పేపర్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ డిగ్రీలో పాసైన వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాము, భాను, ఈశ్వర్ రావు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఎస్‌ఐ ప్రతిభ

- జాతీయ స్థాయిలో 4 బంగారు పతకాలు సాధించిన త్రినాథరావు
- అభినందించిన ఎస్‌పి వకుల్ జిందాల్

ఎస్ఐ త్రినాథరావు, శంకర్రావులను అభినందిస్తున్న ఎస్‌పి జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇటీవల కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో నిర్వహించిన జాతీయస్థాయి డెడ్ లిఫ్ట్ అండ్ బెంచ్ ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీల్లో విజయనగరం వన్‌టౌన్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఆల్తి త్రినాథరావు నాలుగు బంగారు, ఉద్యోగ విరమణ చేసిన ఆర్మ్‌డ్ రిజర్వు హెచ్‌సి మజ్జి శంకర్రావు నాలుగు సిల్వర్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని గురువారం ఎస్‌పి వకుల్ జిందాల్ తన కార్యాలయంలో అభినందించారు. ఎస్‌పి మాట్లాడుతూ పవర్ లిఫ్టింగులో 93కిలోలు, 60 ప్లస్ విభాగంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని నాలుగు బంగారు పతకాలు, 74కిలోలు 70 ప్లస్ విభాగంలో పాల్గొని నాలుగు సిల్వర్ పతకాలు సాధించడం గొప్ప విషయమని అన్నారు. వీరు ఫిట్నెస్ మేనేజ్‌మెంట్‌లో మిగిలిన పోలీసు ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో భూటాన్‌లో నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో కూడా పాల్గొని, మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయనగరం 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్‌కు సేవా పతకం

జిల్లా పోలీసుశాఖలో కమ్యూనికేషను ఇన్‌స్పెక్టరుగా పని చేసి, ఉద్యోగ విరమణ చేసిన పి.వి.రమణమూర్తికి జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని గురువారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ - పోలీసుశాఖకు సుదీర్ఘంగా క్రమశిక్షణతో సంతృప్తి కరంగా విధులు నిర్వహించి, నిస్వార్థంగా సేవలందించే పోలీసు ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అతి ఉత్కృష్ట సేవాపతకం అందిస్తుందన్నారు. కమ్యూనికేషను విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రమణమూర్తి పోలీసుశాఖకు ఎంతో క్రమ శిక్షణతో 38సం.లు నిస్వార్థంగా సేవలందించారన్నారు. ఆయన సేవలను గుర్తించిన అప్పటి జిల్లా పోలీసు అధికారులు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు గతంలోనే ఈ సేవా పతకంను ప్రకటించారని తెలిపారు. పతకం జిల్లా కేంద్రంకు రావడంతో ఉద్యోగ విరమణ అనంతరం పి.వి.రమణమూర్తికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనికేషను ఇన్‌స్పెక్టరు శ్రీకాంత్ యాదవ్, పివి రమణ మూర్తి, కుమార్తె పి.కిరణ్మయి పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన ఇన్‌ఛార్జి కమాండెంట్

విశాఖపట్నం రీజియన్ హోంగార్డు ఇన్‌ఛార్జి కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌పి టి.ఆనందబాబు గురువారం ఎస్‌పి వకుల్ జిందాల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్‌పిని కలిసిన ఇన్‌ఛార్జి కమాండెంట్ ఆనందబాబు

- శిథిలావస్థకు చేరుకున్న వంతెనలు
- పట్టించుకోని అధికారులు
- కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డులు
- భయాందోళనలో ప్రయాణికులు, వాహనదారులు

శిథిలావస్థకు చేరిన మల్లయ్యపేట వంతెన

వారధి వేదన

ప్రజాశక్తి - సంతకవిటి

సంతకవిటి మండలంలోని మల్లయ్యపేట, మంతిన, జావాం, వాసుదేవపట్నం తదితర వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 50 ఏళ్ల క్రితం ఈ వంతెనలు నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. అయితే కనీసం వంతెన వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా కానరావడం లేదు. కళ్లెదుటే వంతెనలు ప్రమాదకరంగా కనిపిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగేటప్పుడు హడావుడి చేసే అధికార యంత్రాంగం ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలలో భాగంగా వీటికి మరమ్మతులు చేపట్టకపోవడంపై పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

పెచ్చులూడుతూ..

వాసుదేవపట్నం వంతెన బయటకు కొత్తదిలా కనిపిస్తుంది. కానీ ఈ వంతెనకు 50 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ వంతెన శ్లాబ్ పెచ్చులూడిపోతున్నాయి. అయితే ఇరువైపులా రక్షణగోడ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయపడుతున్నారు. వాసుదేవపట్నం, పి.జె.పేట, ఎస్.రంగరాయపురం, హోజారం, మేడమర్తి, తమరాం ప్రజలు సంతకవిటి మండల కేంద్రానికి వెళ్లాలంటే ఈ వంతెన దాటాల్సిందే. ఈ వంతెన సమీపంలో కనీసం హెచరిక బోర్డులు కూడా కనిపించడం లేదు. రాత్రి వేళల్లో ప్రయాణికులు ఈ వంతెనపై రావాలంటే భయపడుతున్నారు.

నేడో.. రేపో అనేలా మల్లయ్యపేట వంతెన

మల్లయ్యపేట వద్ద ఉన్న వంతెన నిర్మించి సుమారు 50 ఏళ్ల పైబడటంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కావలి, వాల్తేరు, బూరాడపేట, మంతిన, రామరాయపురం, చిత్తారిపురం, హోజరాం తదితర ప్రాంతాల ప్రజలు సంతకవిటి మండల కేంద్రానికి నిత్యం ఈ వంతెన మీదుగానే ప్రయాణిస్తూ ఉంటారు. ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ లేకపోవడంతో వాహన దారులు, ప్రయాణికులు భయాందోళనకు గురై బిక్కుబిక్కుమంటూ వాహనాలు నడుపుతున్నారు. ఏమైనా వాహనాలు అదుపు తప్పితే సాగునీరు ప్రవహిస్తున్న గెడ్డలోని పడాల్సిందే. ఇంత ప్రమాదమని తెలిసినా కనీసం అధికారులు రక్షణగోడలు ఏర్పాటు చేయడం లేదని వాహనదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఈ వంతెనపై ఉన్న గుంతలను మట్టితో కప్పారు. వర్షాకాలంలో ఈ వంతెన బురదమయమై కనీసం వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

నిత్యం రద్దీ అయినా..

మండలంలోని జావాం వంతెన నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి వంతెన శిథిలావస్థకు చేరుకొంది. ఇరువైపులా రక్షణ గోడ లేదు. ఈ వంతెన దాటిన వెంటనే పగడాలమ్మ తల్లి దేవాలయం ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి యాత్రికులు నిత్యం వస్తుంటారు. వాహన రాకపోకలతో ఈ వంతెన నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి వంతెనపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, ఇరువైపులా రక్షణ గోడను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

పైన పటారం... లోన లొటారం

శిథిలమైన మంతిన వంతెన పిల్లర్లు

మంతిన గ్రామం వద్ద వంతెనను 50 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ వంతెన పైన పటారం.... లోన లొటారం మాదిరి తయారైంది. ఈ వంతెన కింద భాగం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెనపై సంతకవిటి మండల కేంద్రానికి వెళ్తున్న మంతిన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వంతెన పిల్లర్లు బాగా పాడయ్యాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితి. వంతెన వద్ద పంటపొలాలకు సాగునీరు అందించడానికి పూను వేసే చెక్క కట్టర్లు పూర్తిగా పాడైపోయాయి. కనీసం సంబంధిత అధికారులు పట్టించుకోకుండా గాలికి వదిలేశారు.

ప్రమాదకర స్థితిలో ఉన్న జావాం వంతెన

దిగొచ్చిన అధికారులు

- మినుములు కొనుగోలు ప్రారంభం
- ప్రజాశక్తి కథనానికి స్పందన

అపరాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జెడి రామారావు, మార్క్‌ఫెడ్ డిఎం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జామి

మినుములు కొనుగోలుకు అధికారులు ఎట్టకేలకు దిగొచ్చారు. గురువారం మండలంలోని విజినిగిరి గ్రామంలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న మినప పంటను ఎన్‌సిసిఎఫ్ బృందాలతో పాటు వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎన్.వెంకటేశ్వరరావు పరిశీలించారు. శుక్రవారం నుంచి మినుములు కొనుగోలు జరుగుతోందని రైతులకు హామీ ఇచ్చారు. అయితే మినుములను గ్రేడింగ్‌చేసి, శుభ్రం చేసి ఇవ్వాలని రైతులను కోరారు. దీనికి రైతులు అంగీకరించడంతో కొనుగోలు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల పోరాటం, ప్రజాశక్తి వార్త కథనాలపై స్పందించిన అధికారులు కొనుగోలుకుముందుకు రావడం మంచి పరిణామమని రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జామి వ్యవసాయాధికారి కిరణకుమార్, విజినిగిరి గ్రామ సర్పంచ్ కిలారి సూర్యారావు, కొనుగోలు బృందాలు ఉన్నాయి.

ప్రేమ పేరుతో వంచించిన నిందితుడికి పదేళ్ల జైలు

బొబ్బిలి : ప్రేమ పేరుతో వంచించిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.15వేలు జరిమానా విధిస్తూ విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్.పద్మావతి గురువారం తీర్పు చెప్పారు. బొబ్బిలి మండలం సీతయ్యపేటకు చెందిన నిందితుడు దివనాపు అఖిల్ అంబేద్కర్ (29) పాచిపెంట మండలానికి చెందిన ఒకామెను ప్రేమిస్తున్నానని నమ్మించి, వంచించి, శారీరకంగా అనుభవించి పెండ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు బొబ్బిలి పోలీసు స్టేషనులో 2022లో కేసు పెట్టారు. అఖిల్ అంబేద్కర్ నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

రైతులపై వైసిపిది కపట ప్రేమ

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

రైతులపై వైసిపి నాయకులు కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి నియోజకవర్గంలో పంటలను పరిశీలించడం చూస్తే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పది నెలలకు ముందు వారు చేయని పనులను కూడా ఇప్పుడు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ఇంకా ధాన్యం కొనుగోలు జరగడం లేదంటున్నారని.. గత నాలుగైదు సంవత్సరాల్లో రబీలో ఎక్కడైనా ప్రొక్యూర్‌మెంట్ జరిగిందా? అని ప్రశ్నించారు. 'పోనీ.. ఖరీఫ్‌లో మీరు ఎప్పుడైనా సమయానికి కొనుగోలు చేశారా? అని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొంత మేర పంట నష్టం వాటిల్లితే.. ఉద్యాన శాఖాధికారులు ఇప్పటికే పంటను పరిశీలించి, నివేదిక అందజేశారని తెలిపారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాల్సిందే..

పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడులకు ప్రతిచర్యలు ఉంటాయని ప్రకటించిన ప్రధాని నరేంద్రమోదీ.. దానిని ఆచరణలో చేసి చూపించారని.. యావత్ దేశం ఈ నిర్ణయాన్ని హర్షిస్తోందని నాగార్జున అన్నారు. భారతదేశం ఏ మతానికో, దేశానికో వ్యతిరేకం కాదన్నారు. ఉగ్రవాదంపైనే ఈ యుద్ధమని చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, ఎఎంసి చైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు, నాయకులు ప్రసాదుల ప్రసాద్, బొద్దుల నర్సింగరావు, అల్తి బంగారు బాబు, కనకల మురళీమోహన్‌రావు, గంటా పోలి నాయుడు, మైలపల్లి సింహాచలం, గొర్లె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో మేము సైతం

అధికారులకు నోటీసులిచ్చిన ఫీల్డ్‌అసిస్టెంట్లు, విఆర్‌ఎలు, మున్సిపల్ కార్మికులు

విజయనగరంటౌన్.. సమ్మె నోటీసు అందజేస్తున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈనెల 20న జరుగనున్న సమ్మెలో పాల్గొంటున్నామనిజిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస మూర్తికి, విజయనగరం మండల తహశీల్దార్ కూర్మనాథంకు విఆర్‌ఎలు గురువారం సమ్మె నోటీసు అందజేశారు.లేబర్ కోడ్‌ల రద్దు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ఖాళీలు భర్తీ, మూసి వేసిన పరిశ్రమలు తెరవాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు పిలుపు మేరకు సమ్మెలో పాల్గొంటున్నట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, మండల గౌరవాధ్యక్షులు వి.ప్రసాద్ , సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్రావు , మండల కార్యదర్శి రాజు, సభ్యులు భవాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమ్మె నోటీసు

కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని , ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, మేన్ డేస్ రద్దు చేయాలని ఈనెల 20న సమ్మెలో పాల్గొంటామని ఎంపిడిఒ పరిపాలన అధికారికి సమ్మె నోటీసు అందజేశారు. వీరిలో సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు, ఫీల్డు అసిస్టెంట్లు నాగమణి, సురేష్, పద్మావతి సోమేశు, ఈశ్వరమ్మ, భారతి, జ్యోతి ,రాజ్యలక్ష్మి, రామలక్ష్మి ఎర్రమ్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని కోరుతూ ఈనెల 20న సమ్మెలో పాల్గొంటున్నట్లు కమిషనర్ పి.నల్లనయ్యకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ.జగన్మోహన్రావు, బి. భాస్కరరావు, ఎ.రజిని, బి.మోహన్, బి శంకర్రావు, బి. సూరి, పి పోలారావు, తదితరులు పాల్గొన్నారు

ఫీల్డ్ అసిస్టెంట్ల సమ్మె నోటీసు

బొబ్బిలిరూరల్ : ఈ నెల 20న సార్వత్రిక సమ్మెలో తాము సైతం భాగస్వామ్యం అవుతున్నట్లు మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్లు సిఐటియు ఆధ్వర్యాన గురువారం స్థానిక ఎపిఒ లక్ష్మీపతిరాజుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్.. ఎపిఒకు సమ్మె నోటీసు అందిస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లు

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు

బొబ్బిలి : ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు మున్సిపల్ కార్మికులు సమ్మె నోటీసును కమిషనర్ రామలక్ష్మికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.గౌరీష్, జె.రామారావు, సభ్యులు బి.యుగంధర్, జి.వాసు, జి.శంకర్రావు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అక్రమాలను అరికట్టాలి

బిజెపి, జనసేన డిమాండ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో అన్న క్యాంటీన్‌లో అక్రమాలు అరికట్టాలని బిజెపి, జనసేన నాయకులు మైపాడ ప్రసాద్, పతివాడ అచ్చెన్నాయుడు అధికారులను డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అన్న క్యాంటీన్‌ను వారు సందర్శించారు. అల్పాహారం గురించి నిర్వాహకులను అడిగితే ఉదయం 7.30 గంటలకు అయిపోయిందని చెప్పారని వారు తెలిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజులుగా అన్న క్యాంటీన్ నుంచి అల్పాహారం, భోజనం బయటకు వెళ్తున్నట్లు సమాచారం రావడంతో సందర్శించినట్లు తెలిపారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి పేదల కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో అల్పాహారం, భోజనం బయటకు తీసుకుపోవడం అన్యాయమన్నారు. అన్న క్యాంటీన్‌పై అధికారుల పర్యవేక్షణ కరువైందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అదపాక చిన్న, మజ్జి రాంబాబు, బిజెపి నాయకులు ఎస్. సూర్యనారాయణ, ఎన్.నారాయణ మూర్తి పాల్గొన్నారు.

నేడు ఎంఎస్‌ఎంఇ పార్కుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని బలిఘట్టం గ్రామంలో ఎంఎస్ఎంఇ పార్కుకు శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని టిడిపి నాయకులు ఒక ప్రకటనలో కోరారు.

జర్నలిస్ట్ ఇంటిపై దాడులు అమానుషం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బొబ్బిలి జర్నలిస్ట్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాక్షి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్.వ్యాస్‌బాబు మాట్లాడుతూ విజయవాడలోని ఎడిటర్ ఇంటిపై పోలీసులు అన్యాయంగా దాడులు చేయడం అమానుషమని అన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సోదాలు నిర్వహించి ఆస్తులు విధ్వంసం చేశారన్నారు. పత్రికా రంగంపై ఇటువంటి దాడులు శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు జగన్, తిరుమల, రమేష్, శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు తనిఖీ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - సంతకవిటి

వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఉపాధి పని ప్రదేశంలో నీరు, నీడ, మెడికల్ కిట్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లుకు ఎపిఓ ఆర్. హరినాథ్ సూచించారు. ఈ మేరకు ప్రజాశక్తి దినపత్రికలో 'ఉపాధి ఫుల్.. వేతనాలు నిల్' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందిస్తూ గురువారం సంతకవిటిలోని ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎపిఒ మాట్లాడుతూ కొలతలు ప్రకారం పని చేస్తే రోజుకు 307 రూపాయలు వస్తుందన్నారు. ఉపాధి కూలీలు రెండు పూటలా పనిచేయాలని తెలిపారు. ప్రభుత్వం నుండి ఉపాధి పనిముట్లు వచ్చినట్లు అయితే సరఫరా చేస్తామన్నారు. ఉపాధి వేతనదారుల సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే బేబీనాయన సూచించారు. మండల పరిధిలోని కొట్టక్కి సచివాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కొత్త పింఛన్లు ఎన్ని మంజూరయ్యాయని పంచాయతీ కార్యదర్శి ఆకుల ప్రవీణ్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. సచివాలయంలో ప్రస్తుతం అందుతున్న సేవలు, తదితర వాటిపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందే విధంగా కృషి చేయాలని కోరారు.

జెజెఎం మార్గదర్శకాలను అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం

జాతీయ జల జీవన్ మిషన్ ఇచ్చిన మార్గదర్శకాల మేరకు పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. జాతీయ జల జీవన్ మిషన్ సభ్యుల సూచనల మేరకు కార్యక్రమం అమలులో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులను సరిచేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. జాతీయ జెజెఎం అడిషనల్ సెక్రటరీ, మిషన్ డైరెక్టర్లు జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలోని 19 జిల్లాల కలెక్టర్లతో ఈ వీడియో కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, అర్‌డబ్ల్యూఎస్. సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్. కవిత పాల్గొన్నారు.

రైతులకు తోడ్పాటునివ్వాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వ్యవసాయ అభివృద్ధికి రైతులకు తోడ్పాటు అందించాలని ఉద్యాన శాఖ అధికారి అనిత, ఎపిఎం మధు మహేష్ అన్నారు. పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో మండలంలోని విఎఎలు, విహెచ్ఎలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయిల్‌ఫాం వేసిన రైతులను గుర్తించాలని, అన్నదాత సుఖీభవ పథకం గూర్చి రైతులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో 150 ఎకరాల్లో నవధాన్యాలు వేయించాలని తెలిపారు.

మెమో 57ను అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వ మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్.రవి కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ గురువారం పట్టణంలో 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు పోస్టుకార్డు ఉద్యమం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపాధ్యాయులు పోస్టు కార్డు ద్వారా లేఖలు రాసి పోస్టు చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సింహాచలం, మోహన్, నటశేఖర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పింఛనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వికలాంగ పింఛను లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది వెరిఫికేషన్ నోటీసులు అందిస్తున్నారు. కొంపల్లిలో 21 మందికి నోటీసులు అందజేశారు. ఈ నెల 20, 21, 22, 30వ తేదీల్లో విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లాలని పంచాయతీ కార్యదర్శి కమల, వెల్ఫేర్ అసిస్టెంట్ తెలిపారు. కొన్ని పంచాయతీలకు శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రిలో నెల 27న ధ్రువపత్రాలు పరిశీలన చేపడుతున్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

ప్రజాశక్తి-గంట్యాడ

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని జగ్గాపురం, నరవ, నీలావతి, కొటారుబిల్లి కూడలిలో మత్తు పదార్థాలు, సైబర్ క్రైమ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు మించి ఎక్కువ మంది ప్రయాణం చేయకూడదని చెప్పారు.

నైతిక విలువలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా రచయిత్రి కటకం పావని.. విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో డ్రాయింగ్, క్యారం బోర్డ్, చదరంగం తదితర ఆటలు ఆడించినట్లు గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు గ్రామంలో గురువారం రామాలయ పునర్నిర్మాణానికి సర్పంచి బీల రాజేశ్వరి, పాలకవర్గ సభ్యులు, గ్రామపెద్దలు ఆధ్వర్యాన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులు హాజరయ్యారు.

ప్రజలను మోసగించిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-రామభద్రపురం

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 11 నెలలు కావస్తున్నా సంక్షేమ పథకాల ఊసెత్తకుండా ప్రజలను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విమర్శించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు ద్వారా పరుగులు పెట్టిస్తామని వాగ్దానాలు ఇచ్చి ఇప్పుడు వాటిని మరచిపోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, విద్యార్థుల తల్లిదండ్రులకు తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500, బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు 50 ఏళ్లు నిండితే పింఛన్లు.. ఇలా ఏవీ అమలు కాలేదని చెప్పారు. మరోవైపు రెడ్ బుక్ పేరుతో అరాచక పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బొబ్బిలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులేవీ చేయలేదన్నారు.

రామభద్రపురం నుంచి బొబ్బిలి రోడ్డు గుంతలమయంగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరని విమర్శించారు. ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు విసుగుచెందారని, కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మళ్లీ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు అప్పికొండ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో సహాయ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వార్డు పర్యటనలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన.అప్పలరాజు 31వ డివిజన్లో పర్యటించారు. నటరాజ్ కాలనీ, గాయత్రీ నగర్, పద్మావతి నగర్ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలువల సమస్యలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.

చాలా కాలంగా కాలువలలో పూడికతీత చేపట్టకపోవడంతో మురికి నీరు ప్రవాహానికి అడ్డంకి మారుతోందని, స్థానికులు పలు ప్రాంతాల్లో ఫిర్యాదులు చేశారు. అక్కడక్కడ చెత్తాచెదరాలు నిల్వ ఉండడాన్ని గమనించి వెంటనే వాటిని ప్రక్షాళన చేయాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశించారు. ప్రతి డివిజన్‌కు మంజూరు చేసిన 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న అభివద్ధి పనులకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ ఎన్ని లక్ష్మణరావు, ఎఇ సీతారామమూర్తి, పారిశుధ్య పర్యవేక్షుడు రమేష్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే లలితకుమారి

కార్యకర్త కుటుంబానికి నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని పోతనాపల్లి గ్రామానికి చెందిన సాహూ ప్రకాష్ గత డిసెంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ విషయాన్ని టిడిపి నాయకులు కూనిరెడ్డి శ్రీరామ్మూర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన టిడిపి సభ్యత్వం పొందడంతో గురువారం ఆ కుటుంబానికి ఎమ్మెల్యే రూ.5 లక్షల నగదు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనిరెడ్డి శ్రీరామ్మూర్తి, కిలపర్తి ముత్యాల నాయుడు, ఇందుకూరి శ్రీనివాసరాజు, మాజీ ఎంపిటిసి ఈశ్వరరావు, గోగాడ అప్పలసత్యం పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన బి.సుందరరావుకు 'చేయూత"ను అందించేందుకు హోంగార్డులు ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.3,25,180 చెక్కును ఎస్‌పి వకుల్ జిందాల్ గురువారం అందజేశారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని ఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో హోంగార్డ్సు కమాండెంట్ టి. ఆనందబాబు, ఆర్ ఆర్.రమేష్ కుమార్, సూపరింటెండెంట్ టీ.రామకృష్ణ, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి డిఎస్‌సి పుస్తకాలు అందజేస్తున్న సిఐ శ్రీనివాస్, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

గ్రంథాలయానికి డిఎస్‌సి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక గురజాడ గ్రంథాలయానికి డిఎస్‌సి స్టడీ మెటీరియల్‌ను మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. మెటీరియల్‌ను అందజేసిన సంస్థను వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ బి.లక్ష్మి, అసిస్టెంట్ లైబ్రేరియన్ కె.శ్రీనివాస్, ఎం.జమున, సూరిబాబు, కంది గౌరిశంకర్, కంది మూర్తి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు, వివిధ సమస్యలతో బాధపడుతున్న బాధితులను ఆదుకొని వారికి ఆసరాగా నిలబడేందుక రెడ్ క్రాస్ సొసైటీకి తన వంతు సాయంగా బంగారయ్య రక్తదానం చేశాడు. ప్రపంచ తలసేమియా దినోత్సవ సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న గరివిడి మండలం రేగటిఅగ్రహారం గ్రామానికి చెందిన 8 ఏళ్ల తనుశ్రీ కి రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ కె.ఆర్.డి ప్రసాద్‌రావు, సెక్రటరీ కె.సత్యం, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ రాణి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ దినోత్సవ సందర్భంగా రక్తదానం చేశారు.

ఎపిజిఇఎ జిల్లా జాయింట్ సెక్రటరీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా ముదిలిఆదినారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ట్రెజరీ డిపార్టుమెంట్ నుంచి పిఎస్ కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వి యుగంధర్, పట్టణ జాయింట్ సెక్రటరీ పి.సురేష్ బాబు, గజపతినగరం తాలూకా అధ్యక్షులు బి. సింహాచలం, ఉపఖజానా అధికారులు ఐ. రమేష్, సురేష్ శతపతి, పలువురు ట్రెజరీ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పిహెచ్‌సిలో ప్రసవాలు పెరగాలి

డిఎంహెచ్‌ఒ జీవనరాణి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పసవాల సంఖ్యను పెంచాలని డిఎంహెచ్‌ఒ జీవనరాణి వైద్యులను ఆదేశించారు. గురువారం గంట్యాడ మండలంలో పెదమజ్జిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, శ్రద్ధతో రోగులను తనిఖీ చేయాలని సూచించారు. ప్రతిరోజూ ఒపి పెంచాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం కొండతామరాపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు పల్లవి, సతీష్, సిసి రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్, ప్రేమ కుమార్, సీనియర్ సహాయకులు లక్ష్మీబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో సేవలను పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

వైన్‌షాప్ వ్యర్థాలతో సాగునీటికి ఆటంకం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట పట్టణంలోని శివరామరాజుపేట గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న వైన్‌షాప్ వ్యర్థాల వల్ల సాగునీటికి ఆటంకం కలుగుతోంది. పట్టణంలో రాజుల చెరువు నుంచి గెడ్డ ద్వారా శివరామరాజుపేట గ్రామానికి వెళ్లే రహదారిలో శివన్న చెరువు, బావు చెరువు, మంచినీటి కోనేరుకు నీరు ప్రవహిస్తుంది. మందుబాబులు మద్యం సీసాలను, గ్లాసులు, వాటర్ బాటిళ్లను గెడ్డలో పడేయడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోందని రైతులు చెబుతున్నారు. దీనిపై త్వరలో తహశీల్దార్‌ను కలిసి వినతి అందిస్తామని చెప్పారు.

గెడ్డలో పడేసిన వైన్‌షాప్ వ్యర్థాలు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ కార్యకలాపాలు, సమాచారాన్ని తెలుసుకునే హక్కు ప్రతి ఒక్క పౌరుడికి ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో గురువారం సమాచార హక్కు చట్టం 2005 పట్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ ఈ చట్టం అమలై 25 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ప్రజలలో ఇంకా అవగాహన రాలేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. దీంతో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రభుత్వ కార్యకలాపాలలో సమాచారం తెలుసుకోవడం ఎలా అన్న విషయం పైన, దరఖాస్తు ఏ విధంగా చేసుకోవాలి, సమాచారం ఎన్ని రోజుల్లోగా పొందాలి, వంటి విషయాలపై ప్రజలకు సవివరంగా వెల్లడించామని చెప్పారు.

సారా నిర్మూలన దిశగా అడుగులు

ప్రజాశక్తి- గజపతినగరం రూరల్

సారా నిర్మూలన దిశగా అడుగులు వేయాలని ఎక్సైజ్ సిఐ జనార్ధనరావు కోరారు. గజపతినగరం ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని మెంటాడ మండలం గుర్లతమ్మిరాజుపేట గ్రామంలో నవోదయం 2.0లో భాగంగా సర్పంచ్ పైడిరాజు ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తుల అభిప్రాయంతో సారా రహిత గ్రామంగా సిఐ జనార్దన్ రావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జగదీష్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ముత్యాలు, విఆర్ఒ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ జనార్ధనరావు

అరెస్టు

చోరీ కేసుల్లో దొంగల ఆట కట్టించారు పోలీసులు. వేర్వేరు ఘటనల్లో తొమ్మిది మందిని గురువారం అరెస్టు చేశారు. ప్రధానంగా విద్యుత్తు పరికరాల దొంగల ముఠా గుట్టు రట్టు చేశారు.

గంజాయి రవాణా

ప్రజాశక్తి-రామభద్రపురం

గతేడాది చివర్లో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ కేసులో ఆరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. ఒడిశా నుంచి గంజాయి రవాణా చేస్తుండగా చాకచక్యంగా పట్టుబడిన కేసులో 9 మందికి గాను ఐదుగురిని అప్పట్లోనే అరెస్టు చేశారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానిక బైపాస్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న దిలీప్ దుసర బారిక అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. దిలీప్.. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి తాలూకా పొండలు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడిని కోర్టుకు తరలిస్తున్నట్లు సిఐ తెలిపారు. మిగిలిన వారిని పట్టుకునేందుకు నిఘా ముమ్మరం చేస్తున్నామన్నారు.

అదుపులోకి తీసుకున్న నిందితులు, స్వాధీనం చేసుకున్న విద్యుత్తు పరికరాలతో పోలీసులు

విద్యుత్తు పరికరాల దొంగల ముఠా

ప్రజాశక్తి-లక్కవరపుకోట

నియోజకవర్గ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన ముఠాను అరెస్టు చేసినట్లు శృంగవరపుకోట రూరల్ సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆయన కథనం ప్రకారం.. వేపాడ మండలం పాటూరు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో ఎనిమిది మంది వ్యక్తులు ఆటోలో పట్టుబడ్డారు. అందులో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. మిగిలిన ఆరుగురిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. 15 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక మోటారు, రెండు కారు బ్యాటరీలు, విద్యుత్తు వైరు కట్ట తరలిస్తుండగా పట్టుకొన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందని సిఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిని విచారించగా బొద్దాం కొండ పక్కన మిగతా విద్యుత్తు సామగ్రి ఉన్నట్లు తెలిసి, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని పట్టుకున్న ఎస్ఐలు నవీన్ పడాల్, సుదర్శనరావు, వై.వీరజనార్దన్‌ను సిఐ అభినందించారు.

మద్యం చోరీ

ప్రజాశక్తి-కొత్తవలస

వైన్‌షాపులో 240 మద్యం సీసాలను దొంగలించిన ఇద్దరిని పట్టుకున్నట్లు సిఐ షణ్ముఖరావు తెలిపారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలో 202 కాలనీలో ఉన్న వైన్‌షాపులో గత నెల 28న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 240 సీసాలను ఎత్తుకెళ్లారని చెప్పారు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేసి నిందితులను గుర్తించామన్నారు. పెంద్రి యోహాను, పెంద్రి దర్శనబాబు, పెంద్రి ఏసు దొంగతనం చేసినట్లు నిర్ధారణ అయిందని చెప్పారు. అందులో ఇద్దరిని కొత్తవలస గ్రామ ఆర్చ్ వద్ద ఎస్ఐ మన్మథరావు అరెస్టు చేసి, 96 సీసాలను రికవరీ చేసినట్లు వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. మరో నిందితుడు ఏసు పరారీలో ఉన్నట్లు చెప్పారు.